ప్రభ:- కృతార్థుండగు పురుషుడు- శ్వాసము యొక్క యాతాయాత విహారము నన్వేషించుటయే యగు సాధనము చేత ఆనంద నిలయమగు నీ పదము నొందునని భావము. ఊర్పుయొక్క రాకపోకలను గుర్తించుట వలన - దేవీ స్వరూపమగు ఆనందము లభించును. (యాత్)

మూ॥ ధధతుసత్ కవే ర్గణపతేరిమాః
నగభువోముదం, నరమనోరమాః॥ 25

దోష రహితమును, శబ్దార్థమాధుర్యాది గుణ సహితమును, అగు కావ్యమును రచించు గణపతికి సంబంధించిన 'నరమనోరమా' వృత్త నిబద్ధములగు ఈ స్తుతులు నగకుమారికి ప్రీతి నొసంగుంగాత!

ఇది - స్వవ్యాఖ్యమగు ఇరువది మూండవ స్తబకము.

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమా సహస్రము

## ( ఆరవ శతకము – చతుర్థస్తబకము)

## చతుర్వింశ స్తబకము

అవ:- ఇరువది నాలుగవదియగు నీ స్తబకముకూడ - ప్రకీర్ణకమై యున్నది.

మూ॥ చన్ద్రికాసితం చణ్డికాస్మితమ్।
భూతలేసతాం భాతుభూతయే॥ 1

వెన్నెలవలె తెల్లనిదగు చండిక చిరునవ్వు – ఈలోకము నందలి శిష్టుల కైశ్వర్యము నొసంగుటకై వెలయుంగాత!

మూ॥ భాల చక్షుష, శ్చక్షుషాం ఘనమ్।
కిఞ్చిదస్తుమే శస్త వర్ధనమ్॥ 2

లలాట నేత్రుండగు హరుని నేత్రత్రయమునకు భోగ్యమగు ఉమావస్తువు (ఉమాదేవి) నాయొక్క క్షేమమును వృద్ధి నొందించునది యగుంగాత!

ప్రభ:- భావుకము, భవుకము, భవ్యము, కుశలము, క్షేమము, శస్తము, అనునవి క్షేమ శబ్దమునకు పర్యాయపదములు. హరత్రినేత్ర తర్పణమగు ఉమాఖ్యమగు ఘనము – నా క్షేమమును ఘటించుంగాత! అని యర్థము.

మూ॥ సాధు సన్తతి క్షేమకారిణీ
ఘోరదానవానీకదారిణీ॥ 3

సాధుజన సంతతికి క్షేమము నిచ్చునదియు, భయంకరమగు దానవ సైన్యమును భంజించునదియు,

**ప్రభ:-** ఈ శ్లోకార్థమునకు, దీని తరువాతి దానికిని, గూడ-5వ శ్లోకార్థముతో నన్వయమును గ్రహించునది.

మూ॥ యోగ యుక్త సచ్చిత్తచారిణీ
పాదసేవక ప్రాజ్ఞతారిణీ॥ 4

యోగ సాధనముతోఁ గూడుకొనిన సత్పురుషుల చిత్తముల యందు చరించునదియు, పాద సేవకులగు ప్రాజ్ఞులను భవ సముద్రము నుండి తరింపఁ జేయునదియు,

మూ॥ పుష్ప బాణ జిన్నేత్రహారిణీ।
పాతుమాం జగచ్చక్రధారిణీ॥ 5

పుష్పబాణుఁడగు మన్మథుని జయించిన హరుని నేత్రముల నాకర్షించునదియు, జగచ్చక్రమును ధరించునదియు, (భువన సామ్రాజ్యమును భరించునదియు) అగు నుమాదేవి – నన్ను రక్షించుఁగాత!

మూ॥ ద్వాదశాన్త - భూ జాతశారికా
సర్వవాఙ్మయస్యైక కారికా॥ 6

ద్వాదశాంత – వృక్షమునందున్న శారిక, సర్వవాఙ్మయమునకును ఏకమగుకారిక.

**ప్రభ:-** సహస్రార చక్రము మీఁదనున్న చక్రమును – ద్వాదశాంతమని చెప్పుదురు. ఆ ద్వాదశాంత చక్రమనెడి వృక్షమునందున్న పక్షి విశేషమగు శారికయే-ఉమ, శబ్ద ప్రపంచమునంతకు సూత్రప్రాయమగు పద్య రూపమగు కారికయే.



(సమస్త శబ్దబ్రహ్మసారాంశమే) ఉమ యగును. స్వల్పాక్షరముల చేతనే అనల్పార్థమును బోధించునది – కారికయని లాక్షణికులు చెప్పుదురు.

మూ॥ పుణ్యా కర్మసు స్వచ్ఛమస్తకా।
యోగ శాలిషు చ్ఛిన్నమస్తకా॥ 7

పుణ్యకర్మ గలవారి శీర్షమునందు నివసించుట వలన దానిని స్వచ్ఛముగాఁ జేయునదియు, యోగశాలుల శిరోగ్రంథి విశేషములను భేదించునదియు,

**ప్రభ:-** యోగనిష్ఠుల శిరోగ్రంథి భేదనము చేత పరమేశ్వరి యొక్క ప్రసాదధార – నిరర్గళముగా ప్రవర్తించునని భావము. ప్రచండచండీ ప్రస్తావమున ఛిన్నమస్తా (శిరోగ్రంథిభేదన) తత్త్వమును దెలుపు నవసరమునందీ యంశము విస్తరింపఁబడును. కావున నచట పాఠకు లీయర్థమును గుర్తించునది.

మూ॥ ఆత్మ నిష్ఠితేః సమ్ప్రదాయికా
సర్వ జన్మినాం సమ్ప్రవర్తికా॥ 8

ఆత్మ నిష్ఠను సమకూర్చునదియు, సర్వదేహులను చక్కగా ప్రవర్తింపఁజేయునదియు,

**ప్రభ:-** ఆత్మ నిష్ఠవలన పునర్జన్మను నివర్తింపఁజేయునదియు, దేహుల కందఱకును పునర్జన్మను ప్రవర్తింపఁజేయునదియు, గూడ – పరమేశ్వరియే యగునని భావము.

మూ॥ మాం పునాతుసత్ పూజ్యపాదుకా
భాలలోచన - ప్రాణనాయికా॥ 9

సజ్జనుల చేత పూజింపఁదగిన పాదుకలు గలదియు, లలాటలోచనుని హృదయేశ్వరియు, నగుపార్వతి నన్ను పవిత్రునిగాఁ జేయునుగాత.

మూ॥ దానతోయశః, పౌరుషాద్రమా,
సమ్పదోమదః శీలతః క్షమా॥ 10

దానము ( ఇతరులకు ద్రవ్యమునిచ్చుట) వలన కీర్తియు, పౌరుషము (పురుష ప్రయత్నము) వలన రమయు, (లక్ష్మియు) సంపదవలన మదమును, (హర్షమును) శీలము వలన (సత్ ప్రవర్తనము వలన) క్షమయు, (సహనశక్తియు) కలుగును.

మూ॥ సత్యతో జగత్యత్ర గౌరవమ్
యజ్ఞతో దివి స్థాన ముజ్జ్వలమ్॥ 11

సత్య వచనము వలన – ఈలోకమున గౌరవము (పూజ్యత్వము) కలుగును. యజ్ఞము వలన స్వర్గమునం దుజ్జ్వలమగు స్థానము లభించును.

మూ॥ సంయమా దఘవ్రాత వీతతా।
యోగతో మహా సిద్ధిశాలితా॥ 12

సంయమము ( ఇంద్రియని గ్రహము, లేక ధారణా, ధ్యాన, సమాధ్యభ్యాసము) వలన పాపములు తొలఁగును. యోగము వలన (అధ్యాత్మ యోగ నిష్ఠవలన) మహాసిద్ధులు లభించును.

మూ॥ శర్వనారి! తే పాద సేవయా।
సర్వసత్ఫలా వాప్తిరగ్ర్యయా॥ 13

రుద్రపత్నివగు జననీ! శ్రేష్ఠమగు నీపాదసేవచేత – సర్వసత్ – ఫలములును గూడ ప్రాప్తించును.

**ప్రభ:-** దానము, పౌరుషము, మొదలగు వానివలన కీర్తి, లక్ష్మి మున్నగు లాభములు కలుగుననుట సత్యమేయగును. కాని నీ పాద సేవచేత ఈ లాభములన్నియుఁగూడ లభించును. కావున నీ పాద సేవయే – సర్వపుణ్య కర్మలకును గతియని భావము.

మూ॥ నోద్యమేనయా సిద్ధిరుత్తమా।
విశ్వనాయికా వీక్షితేనసా॥ 14

ప్రయత్నము చేత లభింపని సిద్ధి (కూడ) విశ్వేశ్వరీ వీక్షితము చేత లభించును.

మూ॥ సమ్పదాం రమా భారతీ గిరామ్।
త్వం శివే! ప్రభుః ప్రాణ సంవిదామ్॥ 15

సంపదలకు – ప్రభువు లక్ష్మి. వాక్కులకు – నాయిక సరస్వతి. శివా! ప్రాణ- సంవిత్తులకీశ్వరివి నీవు.

**ప్రభ:-** జీవన – ధారణ – క్రియా కరణాదులకు హేతు భూతములగు ప్రాణములకును, బాహ్య జ్ఞానేంద్రియ మనో బుద్ధ్యాదుల కాధారభూతములగు చిత్తులకును – అధీశ్వరివి – నీవే, అనఁగా, నీవే – క్రియా – జ్ఞానశక్తుల కీశ్వరివని భావము.

మూ॥ చక్షుషానభో లక్ష్యధారిణా
సిద్ధ్యతీపతే దేవి! ధారణా॥ 16

దేవీ! ఆకాశమేయగు లక్ష్యమును ధరించునదియగు నేత్రము చేత భవత్ స్వరూప గ్రహణధారణ – సిద్ధించును.

**ప్రభ:-** ఆకాశమే లక్ష్యముగా నేత్రముచేత ధరింపఁబడునేని వేరొక దృశ్యము లేకుండుట వలన శూన్యముగా నవభాసించునదియు, వ్యాపకత్వముతో నొప్పునదియు, నగు దేవీ స్వరూపమును గ్రహించుట యందగు ధారణ సిద్ధించునని భావము. ఔపనిషదమగు సమయము నవలంబించి – ఇదియే – **అక్షి పురుష విద్య** యగును.

మూ॥ అశిరోదధ న్నాభితోఽ నిలమ్
దేవివిన్దతి త్వన్ము నిర్బలమ్. 17

నాభి ప్రదేశమునుండి శిరో దేశము వఱకును ప్రాణవాయువును ధరించుచున్న ముని నీ వలన బలమునొందును.

ప్రభ:- నాభిస్థలము నుండి మస్తకము వఱకును ప్రాణమును ధరించుటచేత శక్తిమంతుఁడగును. ఇచ్చట – ప్రాణాయామము చేత శ్వాసమును స్తంభించుననంశముపదేశింపఁబడుట లేదు. ప్రాణాయామము లేకున్నను ధ్యాన బలము చేతనే యీ స్థితి కలుగునని స్ఫురింపఁజేయుటకు ముని (మననము గలవాఁడు) అనుపదముపయోగింపఁబడినది. ఇది – ఔపనిషదియగు **సంసర్గవిద్య.**

మూ॥ హృద్ గృహాన్తరే యద్ విశోధనమ్
తత్ సవిత్రి! తేస్యాదుపాసనమ్॥ 18

సవిత్రీ! హృదయగుహాంతరము నందు పరీక్షించుట – నీ యుపాసనమగును.

ప్రభ:- ఇది – **దహర విద్య.** అక్షి పురుష విద్య, సంసర్గవిద్య, దహర విద్య అనునవి – యుపాసనలు. అవి యుపనిషత్తుల చేత నుపదేశింపబడినవి. ఆ విద్యలిచట భాషా భేదము నాశ్రయించి సులభముగా ప్రతిపాదింపఁబడినవి.

మూ॥ కాఽహ్యహమ్మతి ర్గోచరం వినా
లోక ధాత్రి! తే రూపభావనా॥ 19

లోకభర్త్రీ! 'ఇది' అను విషయము లేని అనిర్వచనీయమగు అహమ్ మతి- ('నేను' అను తలంపు) నీ రూపమును భావించుటయగును. (భవత్ స్వరూపనిష్ఠయగును) దేహాదినిష్ఠము కాక, ఆత్మనిష్ఠమగు అహంమతియే మాత్ప రూప భావన.



ప్రభ:- 'ఇది' అని గోచరించునది – విషయము. ఇదియను ప్రతీతి లేకుండ' 'నేను' అను ప్రత్యయార్థము యొక్క జ్ఞానము కలుగదు. కావుననే మూలమున 'కాఽపి' (అనిర్వచనీయమగు) అని చెప్పఁబడినది. ఇదంభావము లేకుండ, 'ఉన్నాను' అను సత్తామాత్రమగు జ్ఞానము – శుద్ధమగు బుద్ధియగుచున్నది. ఇది యోగ శాస్త్రమునందు ''అస్మిత'' అని పేర్కొనఁబడినది. ఈయస్మిత – నీ స్వరూపము నందలి నిష్ఠయగునని భావము. ఈ విద్య – ఛాందోగ్య శ్రుతియందు 'వైశ్వానరవిద్య' అగుచున్నది.

మూ॥ అశ్యమణ్డనం కోఽపి విద్యయా।
ఖణ్డనంపరః ప్రాహ నా యయా॥ 20

ఒక విద్వాంసుఁడు – నీవు – విభజింపఁదగని చిత్తుగలదానవని చెప్పెను. ఇంకొకమనుజుఁడు – నీవు – విభజింపఁదగిన చిత్తుగలదానవని చెప్పెను.

ప్రభ:- పక్షములు – రెండున్నవి. నీ చితి కేభేదము లేదనునది ఒక పక్షము. భేదము కలదనునది – వేరొక పక్షము.

మూ॥ మాతరేతయా జీయ తేత్వయా
ఏకయాతనూ - భిన్నయాధియా॥ 21

ఒక్కతెవగు – ఈ నీవు – శరీరములయందగు భిన్న బుద్ధిచేత జయించుచున్నావు.

ప్రభ:- శరీర దృష్టి చేత – భేదము గలదానవును, తదితర దృష్టి చేత – భేదము లేని దానవును (అఖండస్వరూపను) అగుచున్నావని తాత్పర్యము.

మూ॥ బాహ్యాదర్శనే విశ్వపఙ్క్తిలా।
అన్యథాభవస్యమ్బ! కేవలా॥ 22

బాహ్య దృష్టియందు – దృశ్యమును, జడమును, భిన్నమును అగు విశ్వరూపము చేత – పంకిలవై (అస్వచ్ఛవై) యుందువు. సూక్ష్మ దృష్టియందు - ఏకమగు స్వరూపము చేత స్వచ్ఛవై యుందువు.

మూ॥ ఖణ్డవన్నృణాం భాసి భోగినామ్।
అస్యభిన్నచిత్ కాఽపి యోగినామ్॥ 23

నీవఖండ స్వరూపవైనను, భోగులకు (విషయ భోగవంతులగు నరులకు) ఖండ స్వరూపిణివలె భాసింతువు. యోగులకు (యుక్తచేత స్కులగు జ్ఞానులకు) అనిర్వాచ్యవగు చితివగుచున్నావు.

మూ॥ బన్ధ ఏషయద్- భాసిఖణ్డితా
మోక్ష ఏషయద్ భాస్యఖణ్డితా॥ 24

నీవు భేదవంతురాలవై – భాసించుటయే – బంధము. అభేద స్వరూపవై- భాసించుటయే – మోక్షము.

ప్రభ:- భేద దర్శనము బంధము. అభేదదర్శనము – మోక్షము.

మూ॥ ఏతదీశితుః పత్ని! హృన్ముదే
సాప్రతిష్ఠ సద్ గీతమస్తుతే॥ 25

ఈశ్వరపత్నీ! నా చేత రచింపబడిన సుప్రతిష్ఠావృత్త సంబంధియగు సద్గీతము – నీ హృదయమునకు ప్రీతి నొసంగుంగాత!



ఇతి శ్రీ మహర్షి - రమణభగవత్ పాదాన్తే వాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతావుమాసహస్రే
చతుర్వింశః స్తబకః సమాప్తః।

ఇది - శ్రీమహర్షి రమణభగవత్ పాదశిష్యుడు,
శఠమర్షణ సగోత్రుడు
శ్రీమత్ పంతుల పేరయ్య శాస్త్రి పౌత్రుడు,
శ్రీ వేంకటరామ బుధేంద్ర
ద్వితీయ పుత్రుడు, లక్ష్మీనారాయణ శాస్త్రిచేత నాంధ్రీక
రింపబడిన ఉమా సహస్రమను స్తోత్రకావ్యమున
చతుర్వింశస్తబకము (6వ శతకము) - సమాప్తము.

****